క్లుప్తంగా

చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

తహసీల్దార్ ఎం.భవానిశంకర్

ముప్పాళ్ళ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ జరుగుతుందని, ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జరుగుతున్న పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసిందని, ఇకపై దుకాణాల వద్దే సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకు దుకాణాల వద్ద ఏర్పాట్లను వీఆర్వోలు పరిశీలించాలన్నారు. ప్రతి కార్డుదారుక రేషన్ అందేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి



క్రోసూరు: మండల కేంద్రంగా మార్కెట్ యార్డు, ఆవులవారిపాలెం గ్రామం నుంచి గోవులను అక్రమంగా రవాణా చేస్తూ వధశాలలకు తరలిస్తున్నారని, దీనిని అరికట్టాలని విశ్వ హిందూ పరిషత్ గో రక్షక్ కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ వి.వి.నాగరాజుకు, ఎస్ఐ పి.రవిబాబుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.మరిరెడ్డి, సిద్ది కామేశ్వరాచారి, కె.రామాంజనేయులు, కె.సాయిరాం తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వద్ద సోమవారం జరిగింది. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ తల్లి దేవాలయం సమీపంలో నివసిస్తున్న బెల్లంకొండ కృష్ణ వివేక్ (25) ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీ కొట్టి పడిపోయాడు. ఘటనా స్థలంలో తీవ్రంగా రక్తస్రావమైంది. హుటాహుటిన క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు

క్రోసూరు: ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజులపాటు క్రోసూరులో జరగనున్న సీపీఎం పల్నాడు జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. సోమవారం ఆమంచి భవన్‌లో జరిగిన సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ 28, 29, 30 తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు క్రోసూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన కార్యకర్తలు వస్తారన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏ విధమైన ఆందోళనలు, పోరాటాలు చేయాలనే దానిపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, నాయకులు గన్నెపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకోండి

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ

శావల్యాపురం: అర్హత కల్గియున్న బ్యాంకు ఖాతాదారులు బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. సోమవారం శావల్యాపురం బ్రాంచ్ శాఖ పరిధిలో బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన గత ఏడాది ఆరుమళ్ళ లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో సదరు ఖాతాదారుడుకు బ్యాంకులో ప్రమాద బీమా యోజన పథకాన్ని సభ్యత్వం నమోదు చేసుకోవటం వలన శ్రీరామ జనరల్ ఇన్సూరెన్సు సంస్థ ద్వారా రూ. 2 లక్షల రూపాయలు చెక్కును నామిని ఆరుమళ్ళ సామ్రాజ్యంకు బ్రాంచ్ మేనేజరు శివకృష్ణకు అందజేశారు. బ్యాంకులో ఖాతా కల్గియున్న వారందరు ప్రమాదవశాత్తు మృతి చెందితే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బాధిత కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారులను సంప్రదించాలన్నారు. శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్సు ప్రతినిధి యం.కోటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ అరున్‌నెహ్రూ, దిలీప్‌కుమార్, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల





శిథిలావస్థకు చేరిన చల్లగుండ్ల గ్రామంలోని పశు వైద్యశాల భవనం

- చెట్లు మొలిచి బీటలు వారిన గోడలు
- బిక్కుబిక్కుమంటూ వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు బీటలు వారి కూలడానికి సిద్ధంగా తయారైంది. పురాతన భవనం కావడంతో రోడ్డుకు పల్లంగా మారి వర్షపు నీరంతా వైద్యశాలలోకి చేరుతుంది. పశువులకు వైద్య పరీక్షలు చేసే స్టాండ్‌లు కూడా భూమిలో కూరుకుపోవడంతో వైద్య పరీక్షలకు ప్రతికూలంగా మారింది. వైద్యశాల భవనంపై చెట్లు మొలవడంతో గోడలు బీటలు వారాయి. చుట్టూ డ్రైనేజీ నీరు చేరి జమ్ము, పిచ్చిమొక్కలు పెరిగి అడవిలా మారింది. పేరుకే భవనం ఉంది తప్ప సేవలకు మాత్రం నిరుపయోగంగా మారింది. ప్రస్తుత వర్షాలకు ఎప్పుడు భవనం కూలుతుందోనని రైతులు, వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

రెండు గ్రామాలకు వైద్య సేవలు

మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని పశు వైద్యశాలను సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. చల్లగుండ్ల, అడ్డరోడ్డు రెండు గ్రామాల మూగజీవాలకు వైద్య సేవలు ఈ వైద్యశాల ద్వారా అందుతున్నాయి. ఏళ్లు గడవడంతో కాలక్రమేణా భవనం శిథిలావస్థకు చేరుకుంది. అభివృద్ధే మా ధ్యేయమన్న కూటమి ప్రభుత్వం పశు పోషకుల కష్టాల వైపు కన్నెత్తి చూడడం లేదు. రెండు గ్రామాల పరిధిలో ఆవులు–76, గేదెలు–2,433, గొర్రెలు–1,189, మేకలు–153, కోళ్లు–1,264 ఉన్నాయి. నట్టల నివారణ మందులు, చూడి పరీక్షలు, ఎద ఇంజక్షన్‌లు, వ్యాధి నిరోధక టీకాలు తదితర వైద్య సేవల కోసం నిత్యం పదుల సంఖ్యలో మూగజీవాలను రైతులు, పశు పోషకులు వైద్యశాలకు తీసుకొస్తారు. మూగజీవాలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యశాల భవనం ప్రతికూలంగా మారడంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

చల్లగుండ్ల, అడ్డరోడ్డు గ్రామాల ప్రజల్లో అధికశాతం మంది పాడిపంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి వైద్యశాల సిబ్బంది నివేదికలు పంపారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా సరిపడా నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించడంలో అధికారులు చొరవ చూపడం లేదు. రైతుల పక్షాన ఉంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంగా పశు పోషకులకు అవసరమైన పశు వైద్యశాల భవనం నిర్మాణంపై దృష్టి సారించకపోవడం శోచనీయం.

నివేదికలు పంపాం



చల్లగుండ్ల గ్రామంలోని భవనం శిథిలావస్థకు చేరుకుందని, పశువులకు వైద్య సేవలు అందించేందుకు ప్రతికూలంగా మారిందని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరై కొత్త భవనం నిర్మిస్తే పూర్తి వసతులతో మూగజీవాలకు వైద్యసేవలు అందించవచ్చు. నిధుల మంజూరు, కొత్త భవన నిర్మాణానికి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, ఏడీఏ, నకరికల్లు

కళాపరిషత్‌ల కృషి ఎనలేనిది



కళాకారులను సన్మానిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, న్యాయవాది శ్రీనివాసరావు



కళా ప్రదర్శనలు

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయ నాటికల పోటీలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే సోదరుడు డాక్టర్ సీహెచ్ ఫణీంద్ర బాబు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు హాజరై కళాకారులు సూరయ్య, వంకాయలపాటి చెన్నకేశవ, సుబ్బారావులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక, పౌరాణిక నాటకాలకు పూర్వ వైభవం దక్కేలా కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళాకారులకు జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు.

ఆకట్టుకున్న నాటికలు...

బాపట్ల సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో 'వర్క్ ఫ్రం హోమ్' నాటికకు రచయితగా అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకుడిగా మహేంద్ర వ్యవహరించారు. సాతులూరు వజ్జా రామనాథం ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'రారాజు సుయోధన' పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. దర్శకత్వం వజ్జా మధుసూదనరావు వ్యవహరించారు. వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'ఏకాకి' నాటికకు రచయితగా నాగేశ్వరరావు, దర్శకుడిగా ఖాజీపేట తిరుమలయ్య వ్యవహరించారు.

నేటి ప్రదర్శనలు...

హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'అమ్మ చెక్కిన బొమ్మ', న్యూఢిల్లీ వారి 'అనశ్వరం', చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'మా ఇంట్లో మహాభారతం' నాటిక ప్రదర్శనలు జరగనున్నట్లు నిర్వాహకులు, కళాపరిషత్ సభ్యులు తెలిపారు.

సమస్యలపై అర్జీలను వెంటనే పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ వేణుబాబు

మాచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేట నుంచి వీడియో సమావేశంలో తహసీల్దార్లు, పురపాలక సంఘ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన మాట్లాడారు. అయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రేషన్.. పరేషాన్



సత్తెనపల్లిలో ర్యాలీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు



సూపరింటెండెంట్ రవికుమార్‌కు వినతి పత్రం అందించిన ఎండీయూ ఆపరేటర్లు

- ఇంటింటికీ బియ్యం పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం
- డివిజన్ పరిధిలో ఉపాధి కోల్పోతున్న 112 మంది ఆపరేటర్లు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పుణ్యమా అని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు చౌక ధరల దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకునే కష్టాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. 2019కి ముందు రోజులు పునరావృతం కానున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ డీలర్లను బలవంతంగా తొలగించి కూటమి నాయకులకు ప్రభుత్వం కట్టబెట్టింది. రేషన్ బియ్యాన్ని ఒక పథకం ప్రకారం దొడ్డిదారిన మళ్లించేందుకు పెద్ద కుట్రే జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎండీయూతో ఇంటికే రేషన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి ఎండీయూ వాహనం ద్వారా వెయ్యి నుంచి 2 వేల కార్డులకు నిత్యావసరాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి నెల ఒకటి నుంచి 17వ తేదీ వరకు వాహనాలు ఇంటింటికీ తిరిగి సరుకులు అందిస్తూ వచ్చాయి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడం ద్వారా 95 శాతం పైగా కార్డుదారులకు సరుకులు తేలిగ్గా లభించాయి. కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పలుకుతుండడంతో ప్రజలు అవస్థలు పడాల్సిందే. ఎండీయూ వాహనాలు తొలగించడంతో చౌక ధరల దుకాణాల వద్ద లబ్ధిదారులకు కష్టాలు పునరావృతం కానున్నాయి. సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా 354 రేషన్ షాపులు ఉండగా 1,79,379 కార్డులు ఉన్నాయి.

ఉపాధి కోల్పోతున్న ఆపరేటర్లు

ఆరు సంవత్సరాల అగ్రిమెంట్ కాలంతో విధుల్లో చేరిన ఎండీయూ ఆపరేటర్లకు ఇంకా ఒకటిన్నర సంవత్సరం ఉంది. 2027 జనవరి వరకు అగ్రిమెంట్ ఉన్నా ప్రభుత్వం అర్ధంతరంగా తొలగించడంతో డివిజన్ వ్యాప్తంగా ఉన్న 112 మంది ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఈ పనినే నమ్ముకొని దాదాపు ఐదేళ్లుగా జీవనం సాగిస్తున్న ఆపరేటర్లు కూటమి ప్రభుత్వం నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒకటిన్నర సంవత్సరం అగ్రిమెంట్ కాలం ఉండగా తొలగించడం అన్యాయమని ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు ఆందోళన బాట పడుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం సత్తెనపల్లిలో ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన చేపట్టి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవికుమార్‌కు వినతి పత్రం అందించారు.

డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు ఎన్టీఆర్ సేవారత్న అవార్డు



అమరావతి: డాక్టర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్, స్వరాలాపన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పెదమద్దూరుకు చెందిన అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు డాక్టర్ ఎన్టీఆర్ సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి గుంటూరు అమరావతి రోడ్డులో అన్నదాన సమాజ ఆడిటోరియంలో డాక్టర్ ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకొని డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు ఉమ్మడి గుంటూరు జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో చేసిన సామాజిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వరాలాపన సంస్థ అధ్యక్షుడు దేవరకొండ బాలస్వామి, కంబాల బాబురావు అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు, పాడుతా తీయగా గాయకుడు చెన్నై రాము, జనసేన నాయకులు మిరియాల ప్రసాదరావు మిరియాల గోపికుమార్, ప్రముఖ విద్యావేత్త గాదె రత్నారెడ్డి, పాఠశాల విద్యా శాఖ అదనపు సంచాలకులు రాసంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం

రెంటచింతల: బాల్య వివాహాలతో ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు వారి జీవితాలు నాశనం అవుతాయని పల్నాడు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు అన్నారు. కిశోరి వికాసం ప్రత్యేక వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పాలువాయిలో ఆయన బాలికలు, అంగన్‌వాడీ సిబ్బందితో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలురుతో సమానంగా బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. వ్యాయామం, ఆటల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెంటచింతల –2 సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

డొంకమార్గం కోసం.. సొంతభూమి కోసం



యడ్లపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం మండల ప్రజల నుంచి రెండు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి విశ్వనాథుని కండ్రిక వరకు సమగ్ర సర్వే నిర్వహించి డొంకమార్గం హద్దుల్ని నిర్ధారించాలని జాలాది నీటి సంఘం అధ్యక్షుడు పోపూరి రాఘవయ్య, మాజీ పంచాయతీ ఉపసర్పంచ్ ముత్తవరపు సుబ్బారావు అందించారు. ఇదే విషయంపై యడ్లపాడు గ్రామ పంచాయతీలో ఏప్రిల్ 4వ తేదీన జరిగిన సాధారణ సమావేశంలో సర్పంచ్ కారుచోల హేమ అధ్యక్షతన తీర్మానించిన ప్రతితో వినతిని అందించినట్లు వారు తెలిపారు. అలాగే తన పట్టా భూమిలో కొలతలు తగ్గాయని, సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ ఉన్నవకు చెందిన గోగినేని శ్రీనివాసరావు వినతి సమర్పించాడు. ఈ వినతుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని విజయశ్రీ తెలిపారు.

ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సుజన కుమార్ అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కొనాక్ డయాగ్నస్టిక్స్ వారు ఉచితంగా షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పంతులుగా ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తహసీల్దార్ అశ్రఫున్నీసా బేగం



యోగా చేస్తున్న తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీవో, సిబ్బంది

బెల్లంకొండ: యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ అశ్రఫున్నీసా బేగం తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బెల్లంకొండలో 11వ అంతర్జాతీయ యోగా మాసోత్సవాలలో భాగంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిత్యజీవితంలో యోగాను అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. యోగా ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాలలో యోగా రిజిస్ట్రేషన్ జరుగుతుందని, వచ్చే నెల 21 వరకు జరిగే యోగ శిక్షణ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు మండల పరిషత్, రెవెన్యూ, పోలీస్, ఆయుష్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌నాయక్, ఎస్సై ప్రవీణ్, ఈవోపీఆర్డీ వెంకటగిరి రెడ్డి, వివిధ గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మిశెట్టిపై దాడికి నిరసనగా న్యాయవాదుల విధులు బహిష్కరణ

సత్తెనపల్లి: న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఆ దాడిలో కొమ్మిశెట్టి సెల్‌ఫోన్‌ను ఆయనపై దాడి చేసిన వారు తీసుకెళ్లారని దానిని పోలీసు అధికారులకు బార్ అసోసియేషన్ ద్వారా తెలియజేసి ముందుగా ఆ సెల్‌ఫోన్ ఇప్పించాలని, కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై పెట్టిన కేసును, కౌంటర్ కేసును పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ కార్యవర్గం సంబంధిత అధికారులను కలిసి రిప్రజెంటేషన్ ఇవ్వాలని, ఇక నుంచి న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుకు తగిన భద్రత కల్పించాలని సంబంధిత అధికారులను బార్ అసోసియేషన్ ద్వారా కోరాలని బార్ అసోసియేషన్ తీర్మానం చేసింది. సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

డీ అడిక్షన్ సెంటర్‌కు స్థలం ఎంపిక

ప్రభుత్వ హాస్పిటల్‌లో పరిశీలించి నిర్ధారించిన అధికారులు



హాస్పిటల్‌లో పర్యటిస్తున్న డాక్టర్ ప్రసూన, డాక్టర్ లక్కిరెడ్డి

నరసరావుపేట: కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మత్తు వ్యవసన విముక్తి కేంద్రం (డీడీసీఏ) ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సోమవారం పరిశీలించి ఎంపిక చేశారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ప్రసూన, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్‌తో డీఅడిక్షన్ సెంటర్ స్థాపన కోసం అన్ని ప్రమాణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న అనుకూలమైన స్థలం రెండవ అంతస్తులో గుర్తించి నిర్ధారించారు. మత్తు వ్యసన సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సమగ్ర వైద్యసేవలు అందించేందుకు త్వరలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం, సమీప ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడానికి కీలకంగా ఉంటుందన్నారు.

నవరసభరితంగా సంగీత నాట్య పోటీలు

- ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
- మూడోరోజు కొనసాగిన కళానిలయం జాతీయస్థాయి సంగీత నాట్యపోటీలు



ఆర్ దివ్యనందిని



పూర్వవేదాంత్



మిట్ట రితీక్ష



దివ్యవర్మ

చిలకలూరిపేట: పురివిప్పిన నెమలిని తలపించే నృత్యాలు.. మనసును పులకింపచేసే కీర్తనలు.. సుమధుర గీతాలు... ఉర్రూతలూగించే జానపద నృత్యాల నడుమ కళానిలయం 40వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు సోమవారం మూడో రోజు కొనసాగాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొనసాగుతున్న ఈ పోటీలలో చివరిరోజు వివిధ అంశాలలో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని కళారూపాలను ప్రదర్శించారు. మూడో రోజు పోటీలను కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి శివ సత్యనారాయణమ్మ నటరాజపూజ చేసి ప్రారంభించారు. సూర్య, చంద్ర విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో జానపద నృత్యాలతో పాటు శాస్త్రీయ బృందనాట్యాలు, శాస్త్రీయ జంటనాట్యాలు, శాస్త్రీయం కాని జంటనాట్యాలు, శాస్త్రీయ కాని బృందనాట్యాలు, శాస్త్రీయ నృత్య నాటికలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తుమ్మెదలున్నాయేమిరా, చిరుతముత్తి, పారేగోదావరి, నా పేరు మల్లిగాడు, పోమతి పొన్నమ్మ, ఓరి మగడా, మొక్కజొన్న చేనులో వంటి జానపద నృత్యాలతో పాటు, శ్రీకృష్ణ తరంగిణి, సారూప్యం, దేవిస్తుతి, కాళింగనర్తనం, శ్రీకృష్ణలీలలు, గోవర్ధనం వంటి బృందనాట్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా జానపద నృత్యాలు రసజ్ఞులైన ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా నాట్యాచార్యులకు సన్మానాలు నిర్వహించారు. ప్రేక్షకులు ఆసక్తిగా ప్రదర్శనలను వీక్షించారు.

రేషన్ షాపుల తనిఖీ

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో సోమవారం పలు రేషన్ షాపుల్లో తహసీల్దార్ ఏవీ రమణ తనిఖీలు చేశారు. వీఆర్వో వెంకటరమణతో కలిసి రేషన్ షాపుల్లో నిల్వలు పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందని జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల సరుకులు తీసుకోవాలన్నారు. బియ్యాన్ని డీలర్లకు అమ్ముకోవద్దన్నారు.